క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల్లో నర్సీపట్నం కోలాట బృందం



శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న అన్నమయ్య కోలాట బృందం

నర్సీపట్నం: తిరుపతి బ్రహ్మోత్సవాల్లో నర్సీపట్నానికి చెందిన అన్నమయ్య కోలాట బృందం పాల్గొంది. అత్యంత వైభవంగా నిర్వహించే శ్రీవారి ఉత్సవాల్లో కోలాట ప్రదర్శన పూర్తి చేసుకుని శనివారం స్వస్థలానికి చేరుకుంది. బృంద సభ్యులకు వ్యాపారి వెలగా నారాయణ రావు, దేవత కామేష్ ఘన స్వాగతం పలికారు.

పశువ్యాధులపై అప్రమత్తత

మాకవరపాలెం: పశులకు సోకే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని రాచపల్లి పశువైద్యాధికారి అనిల్‌కుమార్ సూచించారు. శుక్రవారం తామరంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 పశువులకు గర్భకోశ నివారణ చికిత్సలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ పశువుల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రామ్మోహన్‌రావు, గోపాలమిత్ర బాబ్జీ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతకు పరామర్శ

దేవరాపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న బోయిలకింతాడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొప్పాక దేముళ్లను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శుక్రవారం పరామర్శించారు. మోకాళ్లకు శస్త్ర చికిత్స చేయించుకున్న అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు, మండల వ్యవసాయ శాఖ సలహా సంఘం చైర్మన్ అన్నం రామునాయుడు, పాల సంఘం అధ్యక్షుడు అన్నం సాంబమూర్తి, సీనియర్ నాయకులు అన్నం రాము, సనివాడ రాజు, పడిదెడకల శంకరరావు, గొరపల్లి కృష్ణారావు, దాసరి వెంకటరమణ పాల్గొన్నారు.

వేడుకగా సత్యసాయి అవతార్ దినోత్సవం

కె.కోటపాడు: కింతాడ పంచాయతీ కూండ్రపువానిపాలెంలోని రామ సత్యసాయి మందిరంలో సత్యసాయిబాబా అవతార్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. జెడ్పీ సీఈవో పి.శ్రీరామమూర్తి, విజయనగరం జిల్లా బొండపల్లి తహసీల్దార్ ప్రసాద్, ఉపాధ్యాయుడు చిరికి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. సత్యసాయి సేవా సంస్థల జోన్-3 కన్వీనర్ కశిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వాలని వినతి



ఎంపీడీవో మీనాకుమారికి వినతి పత్రం అందజేస్తున్న నర్సింహమూర్తి

మాడుగుల రూరల్: మండలంలో గ్రామ పంచాయతీ కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు, ఎలక్ట్రీషియన్లకు పాత బకాయిలు చెల్లించాలని సీఐటీయూ మండల నాయకుడు ఇరటా నర్సింహమూర్తి కోరారు. శుక్రవారం ఎంపీడీవో మీనాకుమారికి వినతిపత్రం అందజేశారు. చాలీచాలని జీతాలతో రెండు సంవత్సరాలుగా నెట్టికొస్తున్నారని వాపోయారు.

వైభవంగా సారె ఊరేగింపు



మాకవరపాలెంలో సారె ఊరేగింపులో భక్తులు

మాకవరపాలెం: స్థానిక బీసీ కాలనీలో దుర్గాదేవి అమ్మవారి సారె, బోనాల ఊరేగింపు శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాల భక్తులు పలు రకాల పిండి వంటలు తయారు చేసి పురవీధుల్లో ఊరేగింపుగా తిరిగి అమ్మవారికి నివేదించారు.

దామునాపల్లిలో..

చోడవరం: దామునాపల్లిలో దుర్గాదేవికి సారె ఊరేగింపు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ బలిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భవానీ భక్తులు ప్రతీ ఇంటి నుంచి పిండివంటలు చేసి గ్రామంలో మేళతాళాల మధ్య సారె ఊరేగించారు. అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు.



కె.కోటపాడు : మందులపై వైద్య సిబ్బందిని ఆరా తీస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



బుచ్చెయ్యపేట: కళ్లద్దాలు అందజేస్తున్న విప్ కరణం ధర్మశ్రీ



రావికమతం: రోగిని పరీక్ష చేస్తున్న వైద్యాధికారి శ్రీరజని



దేవరాపల్లి: చింతలపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన ప్రజలు

ప్రతి ఒక్కరి ఆరోగ్యం.. కుటుంబ సౌభాగ్యం

- జగనన్న ఆరోగ్య సురక్షలో కార్పొరేట్ వైద్య సేవలు
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, విప్ కరణం ధర్మశ్రీ

దేవరాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పల్లెలతోపాటు మారుమూల గిరిజన గ్రామాల్లో సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చిందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గిరిజన పంచాయతీ చింతలపూడిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో మందులు, రక్త పరీక్షల కౌంటర్లను పరిశీలించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించి రుచి చూశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్య భాగ్యాన్ని అందించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, ఎంపీటీసీ బండి గౌరమ్మ, తామరబ్బ సర్పంచ్ టోకురి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ దొమ్మంగి సన్యాసమ్మ, గలేరి గంగరాజు, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీవో వి.మంగతయారు, పంచాయతీ సెక్రటరీ ఎల్. లింగన్న పాల్గొన్నారు.

కె.కోటపాడు: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటే, ఆ కుటుంబం సౌభాగ్యంతో ఉంటుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. శుక్రవారం పిండ్రంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాల్లో 14 రకాల వ్యాధినిర్ధారిత పరీక్షలతోపాటు 105 రకాల మందులు ఇస్తున్నట్టు వివరించారు. పెద్దరోగాలకు ప్రభుత్వమే పట్టణాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను తిలకించారు. పిండ్రంగి, లంకవానిపాలెం, దీక్షితులపాలెం గ్రామాలకు చెందిన 289 మందిని పరీక్షించి మందులు ఇచ్చినట్లు లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, పిండ్రంగి, లంకవానిపాలెం గ్రామాల సర్పంచ్‌లు జాగరపు రామలక్ష్మి, వేచలపు దొరబాబు, ఎంపీటీసీ నెక్కల గోపి, ఎంపీడీవో కె.శచీదేవి, ఈవోపీఆర్డీ ప్రసాద్ పాల్గొన్నారు.



మాడుగుల రూరల్: తురువోలులో స్టాళ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

బుచ్చెయ్యపేట: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందుతోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. శుక్రవారం పొట్టిదొరపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి, వైద్య సేవలపై ఆరా తీశారు. ఇక్కడ 432 మంది రోగులకు వైద్యులు రమేష్, సంధ్యారాణి వైద్య సేవలందించారు. వీరిలో 22 మందిని మెరుగైన వైద్యం కోసం ఎంపిక చేశారు. పది మందికి కళ్లద్దాలు అందజేయగా, 75 మందిని నేత్ర శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండ రాంబాబు, ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండ లలిత నారాయణమూర్తి, సర్పంచ్ ధర్మశెట్టి అప్పలనాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షుడు మోటూరి చిన్నమనాయుడు, ఉప సర్పంచ్ గుద్దేటి శ్రీను, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో శివన్నరాజు పాల్గొన్నారు.



మాడుగుల: ముకుందపురంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రామధర్మజ, సర్పంచ్ గణేష్

రావికమతం: గ్రామాల్లోనే స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. శుక్రవారం కిత్తంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్య సేవలను పరిశీలించి, రోగులతో మాట్లాడారు. వీరికి మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. ఈ శిబిరానికి 282 మంది వివిధ సమస్యలతో హాజరయ్యారు. వారందరికీ బీపీ, సుగర్ చెక్ చేసి అవసరమైన వారికి వైద్యులు ఇంజెక్షన్లు, మందులు అందించారు.

మాడుగుల రూరల్: ప్రజలు ఆరోగ్య భద్రతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని చీడికాడ జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదా వరలక్ష్మి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా తురువోలులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ కురచా జయమ్మతో కలిసి ఆమె ప్రారంభించారు. 450 మందిని నలుగురు వైద్యులు పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్, సేంద్రియ వ్యవసాయం ఆధ్వర్యంలో స్టాళ్లు ప్రదర్శించారు. ఎంపీడీవో జయప్రకాష్‌రావు, సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పి.టి.బాబు, ఐసీడీఎస్ సీడీపీవో సిహెచ్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి అనూష, వైఎస్సార్‌సీపీ నాయకులు లాలం జానకీరామ్, అంగన్‌వాడీ, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



మాకవరపాలెం: శెట్టిపాలెంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

మాడుగుల: ముకుందపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ వి. రామధర్మజ ప్రారంభించారు. ఈ శిబిరంలో 336 మంది రోగులను కింతలి, వడ్డాది పీహెచ్‌సీ వైద్యులు కె.ఎం.నాయుడు, సి.హెచ్.వి.శకుంతలతోపాటు చిన్న పిల్లలు, జనరల్ మెడిసిన్ వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా కళ్లద్దాలు అందజేశారు. సర్పంచ్ కర్రి గణేశ్, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, వంటర్లపాలెం సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జి. కనకారావు, ఏఎన్ఎం దేవి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకవరపాలెం: శెట్టిపాలెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరంలో 405 మందికి వైద్య సేవలందించారు. ఈ శిబిరానికి శెట్టిపాలెం, జెడ్.గంగవరం, భీమబోయినపాలెం గ్రామాల నుంచి రోగులు హాజరయ్యారు. వీరికి స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వీరిలో 21 మందికి మెరుగైన చికిత్సలు అవసరమని గుర్తించారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ ప్రసాదరావు, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు దుంగల సత్యనారాయణ, వాసు, రమణ పాల్గొన్నారు.

చోడవరం: గజపతినగరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ మళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించిన ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండారు సత్యనారాయణ పరిశీలించారు. ధర్మశ్రీ మాట్లాడుతూ ఆరోగ్య సురక్షలో ప్రతీ ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై జల్లెడ పడుతున్నామన్నారు. ప్రజారోగ్యం కోసం ఇంతగా పట్టించుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. ఆధునిక, మెరుగైన వైద్యాన్ని పేదలందరికీ అందించడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ నిర్వహించని విధంగా పైసా ఖర్చు లేకుండా ఇంటికే వైద్యాన్ని తెచ్చి అందిస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఈవోపీఆర్డీ చైతన్య, వైస్ ఎంపీపీ బుద్ద గంగరాజు, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ తంగుడుబిల్లి జగ్గారావు, సచివాలయ మండల కన్వీనర్ పతివాడ అప్పారావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చోద్యంలో కనకదుర్గ ఆలయం ప్రారంభం



ఆలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



టెంకాయ కొట్టి భూమిపూజ చేస్తున్న భవానీమాలధారణ భక్తులు

గొలుగొండ: చోద్యంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గ ఆలయాన్ని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర శెట్టి బలిజ సంఘం డైరెక్టర్ బొందల రాజు ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఇక్కడ ఆలయం నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ గ్రామంలో ఆలయ నిర్మాణం చేయడం వల్ల ఈ ప్రాంత ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతోపాటు దాతలు విరాళాలతో ఆలయ నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైస్ ఎంపీపీ సుర్ల బాజ్జి, బొందల రాజు, లింగంపేట సర్పంచ్ తోకల సంతోష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజయకనకదుర్గ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మాడుగుల రూరల్: కె.జె.పురంలో విజయకనకదుర్గ ఆలయ నిర్మాణానికి భవానీమాలధారణ భక్తులు శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తాచేరు నది ఒడ్డున ఆలయం నిర్మాణానికి సంబంధించి తుప్పలు డొంకలు తొలగించారు. దాతలు సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ముందుగా దాతలు ఆలయ నిర్మాణానికి విరాళాలు ప్రకటించారు.

మాడుగులలో 90,400 చేప పిల్లల విడుదల



పెద్దేరు జలాశయంలో చేప పిల్లలను విడుదల చేస్తున్న జెడ్పీటీసీ రమణమ్మ, సర్పంచ్ మల్లేశ్వరి



పాలగెడ్డ జలాశయంలో చేపపిల్లలను విడుదల చేస్తున్న సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ శ్రీనివాస్

మాడుగుల: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా మండలంలోని పెద్దేరు జలాశయంలో 66 వేలు, పాలగెడ్డ జలాశయంలో 4,400, ఒమ్మలి, ఎం. కోడూరు, సాగరం, ఎరుకువాడ, కేజేపురం పంట చెరువుల్లో 20 వేలు చేప పిల్లలు శుక్రవారం విడుదల చేశారు. మత్స్యకారులను ఆదుకోవడానికే ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందజేస్తుందని స్థానిక మత్స్య శాఖాధికారి నాగమణి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ దేవరాపల్లి శ్రీనివాసరావు, జాలంపల్లి సర్పంచ్ దిరా మల్లేశ్వరి చిన్ని, ఉప సర్పంచ్ బోర లక్ష్మి, మత్స్య శాఖ సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు.

కొత్తకోటలో అన్నసమారాధన



కొత్తకోటలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

రావికమతం: శాంతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కొత్తకోటలో శుక్రవారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. యూనియన్‌కు చెందిన 515 మంది సభ్యులు ఏటా ఇక్కడ కోటవీధి రామ మందిరం వద్ద దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.



రోలుగుంటలో అన్నసమారాధన నిర్వహిస్తున్న నేతాజీ యువజన సంఘం

రోలుగుంట: స్థానిక నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో పాత రామ మందిరం వద్ద కల్యాణ మండపంలో దేవీనవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వస్తున్నారు. ఇందులో భాగంగా భవానీ మాల ధారులతోపాటు భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో పాటు కొండపాలెం, కె.నాయుడుపాలెం, కొవ్వూరు తదితర గ్రామాల భక్తులు తరలి వచ్చి ప్రసాదం స్వీకరించారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

నర్సీపట్నం: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద శుక్రవారం ఖాళీ పాత్రలతో నిరసన చేపట్టారు. సంఘం నాయకులు ఎన్.రమేష్, సతీష్, వెంకట్రావు, బి.భవాని, ఎస్.ధనలక్ష్మి, సిహెచ్.రామలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నడూ లేని విధంగా పింఢ్రంగి అభివృద్ధి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సర్పంచ్, ఎంపీటీలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: ఎన్నడూ లేని విధంగా పిండ్రంగిలో చేసిన అభివృద్ధిని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజలకు వివరించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. సర్పంచ్ జాగరపు రామలక్ష్మి, ఎంపీటీసీ నెక్కల గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులతో శుక్రవారం పిండ్రంగిలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల కాలంలో ఇక్కడ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉండేదన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించానన్నారు. ప్రధానంగా పిండ్రంగి నుంచి విజయనగరం జిల్లా ముషిరాం, కొత్తభూమి గ్రామాలకు, పిండ్రంగి నుంచి దీక్షితుల అగ్రహారం జంక్షన్ వరకు తారురోడ్లు నిర్మించామన్నారు. లంకవానిపాలెం నుంచి పిండ్రంగి మీదుగా కింతాడ వరకూ రోడ్డు పునర్నిర్మాణం పూర్తి చేసి రవాణా కష్టాలు తొలగించానన్నారు. అన్ని వీధుల్లోనూ సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టడంతోపాటు ఇంటింటికీ కుళాయిలు, అదనపు ట్యాంక్ నిర్మించామన్నారు. ఎ.కోడూరులో దుర్గాదేవి మండపం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు, ఎంపీటీసీ లెక్కల గౌతమి, గ్రామ కన్వీనర్ బొడ్డు ప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీ పాటూరి ఈశ్వరరావు, శెట్టి బలిజ కుటుంబాల వారు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వెదురు పొంతలు

రోడ్డు మార్జిన్లను కప్పేస్తుండటంతో తరచూ ప్రమాదాలు



రోడ్డు మార్జిన్ కనిపించకుండా పెరిగిన చెట్లు

నాతవరం: మండలంలో పెడిమికొండ అటవీ ప్రాంతంలో నర్సీపట్నం – తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్లను వెదురు పొంతలు కప్పేస్తుండటంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవడానికి అవకాశం లేకుండా ఇవి ఏపుగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో రెణ్నెల్ల వ్యవధిలో 15పైగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా, ఇద్దరికి అంగ వైకల్యం, మరి కొందరికి గాయాలయ్యాయి. రాత్రిళ్లు ద్విచక్ర వాహనం మీద ప్రయాణించే వారు ఏ సమయంలోనూ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. తాండవ జంక్షన్ నుంచి గాంధీనగరం మధ్య అటవీ ప్రాంతంలో రోడ్డుకిరువైపులా కిలోమీటరన్నరకు పైగా అర్‌అండ్‌బీ రోడ్డును కప్పేసిన చెట్లను తొలగించాలని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో శృంగవరం సర్పంచ్ ఉలబాల శ్రీనువాస్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అబ్దుల్ రజాక్ ప్రశ్నించారు. ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధికారులను సూచించారు. వెంటనే తొలగిస్తామని మండల అటవీశాఖ సెక్షన్ అధికారి మహేష్‌గిరి సభలో సమాధానం ఇచ్చారు. అయినప్పటికీ ఇంత వరకు చర్యలు తీసుకున్న పాపాన పోలేదని వాహన దారులు వాపోతున్నారు. క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యా సిద్ధిదాయిని

సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ.. విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా అంటూ విద్యార్థులు చదువుల తల్లిని కొలిచారు. ఆశ్వీయుజ శుద్ధ సప్తమి మూలా నక్షత్రం సందర్భంగా దుర్గాదేవి అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం అమ్మవారిని పలుచోట్ల పెన్నులు, పుస్తకాలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించారు.

మాకవరపాలెం: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని తామరం, బూరుగుపాలెం, జంగాలపల్లి, తూటిపాల, మాకవరపాలెం, గిడుతూరు, రామన్నపాలెం, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపాల్లో శుక్రవారం విద్యార్థులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాకవరపాలెం బీసీ కాలనీలో దుర్గామల్లేశ్వర దేవాలయంలో సర్వతీదేవికి పూజలు చేశారు. బూరుగుపాలెంలో సామూహిక కుంకుమార్చన చేశారు.

మాడుగుల రూరల్: వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎం. కోడూరు శివాలయంలో పార్వతీదేవిని సరస్వతీదేవిగా అలంకరించారు. కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అష్టలక్ష్మి కుంకుమ పూజలు చేశారు.

చీడికాడలో...

చీడికాడ చావిడి వద్ద దుర్గమ్మకు భక్తులు పూజలు చేశారు. అప్పలరాజుపురం లలితాదేవి మెట్ట మీద అమ్మవారి ఆలయంలో భవానీభక్తులు పూజలు నిర్వహించారు.

మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ

రావికమతం: కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు లలితా మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు వేపా రామకృష్ణ కిశోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున హాజరై దర్శనం చేసుకున్నారు.

చోడవరం: స్థానిక పాత బస్టాండ్ దగ్గర దుర్గాదేవి ఆలయంలో దుర్గాదేవి అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. వీణ, పెన్నులు, పుస్తకాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలతోపాటు సామూహిక అక్షరాభ్యాసం చేశారు.



మాకవరపాలెంలో సర్వతీదేవి పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



కొత్తకోటలో మహాలక్ష్మి దేవిగా దుర్గమ్మ



వంటర్లపాలెంలో సరస్వతీదేవిగా..



ఎం. కోడూరు శివాలయంలో సరస్వతీదేవి అలంకరణలో..